# రాచ పట్టు

## 1

తెలుఁగు దేశమునఁ జలువ వంశమునకును గలువ వంశ మునకును విలువకలదు. ఈ రెండు వంగడములవారును దరతర ములనుండియు వియ్యమువారు. పరాక్రమమునను బరిధవము నను సరివారు.

మొగలాయి యేలుబడిలో కోడిపందెములతో పాటు గుఱ్ఱపుఁ బందెములకును మోజు హెచ్చెను. ఏలికల యెుర వడివలనఁ 'గలువ రామారాయణింవారును జలువ వెంగళ రాయణింవారును గుర్రపుఁ బందెమునకు దిగిరి. వెంగళరాయ ణింవారు వెనుకఁబడిరి. 'చలువమడతలవారికిఁ గోడిపందెములు గాని గుర్రపుఁబందెము లేటి కని కలువరామారాయణిం వారు గేలిచేసిరి. 'కలువవారు పలువవారని వెంగళరావుగారు వెక్కిరించిరి.

బాపనవారికిఁ బరిహాస మిష్టదేవత, రాచవారికో రణ దేవత. రామారాయణింవారు కత్తిదూసిరి. వెంగళరాయణిం వారు ప్రేటు వేసిరి. విడఁదీయుటకు నడుమఁకు వెళ్లిన కొందఱు బంటులు వారి కత్తులకు బలియైరి. ఈ వార్త నగరికిఁ జేరెను. నగరమంతయు నచటికిఁ జేరెను. వియ్యముఁవారును నెయ్యము వారును వచ్చులోపుగా వారిరువురును రణభూమికి బలియై

పోయిరి. నాఁటినుండి నేఁటివఱకును ఆ రెండు వంగడముల నడుమఁ బచ్చిగడ్డి పడుచో బగబగ మండిపోవును.

2

కొన్ని తరములు కడచెను. తరములు కడచినకొలఁది చలపకారము పెరిగెను. మరల వియ్యమందుటయే దీనికి మందని ఉభయవంశములవారును గ్రహించుకొనిరి. అంతటఁ గలువ వెంకయ్యమ్మారావుగారికిని జలువ పాపారావుగారికిని బెండ్లి యాలోచనలు జరగెను.

వివాహ మొక నదీసంగమము. ఆతీర్థమున నుభయవంశములును శాంతి రసము గ్రోలును. వెంకయ్యమ్మారావుగారి కిరువది దాఁటెను. సాము చే దృఢమయిన యామె శరీరమినుము; నూనె రాచిన మినుము.

పెండ్లి ముంతనమునకుఁ దలిదండ్రులే యధిదైవతములు గావునఁ గలువవారు చంద్రిక యను నొకదాసిని జలువవారి దివాణమున కంపిరి. చలువవారును చంద్రముఖి యను నొక దాసిని కలువవారి దివాణమున కంపిరి.

ఈ దాసిక లిరువురును ఈ రెండు దివాణములయందును గుత్తుకబంటిగా భుజించిరి. క్రొత్తచీరలు కట్టుకొనిరి.

అక్కడ పాపారావుగారు చంద్రిక నేకాంతమునకుఁ బిలిపించుకొని రేయి చాలఁ బ్రొద్దుపోవువఱకు మాటాడిరి.

ఇక్కడ చంద్రముఖి వెంకయ్యమ్మారావుగారి యేకాంత భాషణమునకుఁగాని ఆమె రూపమునకుఁగాని అంత సుముఖి కాలేదు. కాని సుముహూర్తము నిశ్చిత మాయెను.

3

ధర్మారావుగా రల్లున కొకయేనుఁగును రెండు లొట్టియలును నాలుగు గుఱ్ఱములును ఎనిమిది యూళ్లను పదునాలుగురు దాసికలను నూఱావులను కట్నమిచ్చి కోరికను వెలిబుచ్చిరి.

మునిముందు జయభేరియు పిదప ముఖవీణయు వెనుక సనాయియు తరువాత నేనుఁగులును గుర్రములును ఒంటెలును బంటులును వారాంగనలును కూడిరా పట్టపేనుఁ గెక్కి పాపారావుగారు పాణిగ్రహణమునకు బయలుదేఱిరి.

పెండ్లికొడుకు యుద్ధముచేయని వీరుఁడు. రాజ్యము లేని రాజు. అతఁడూరేఁగి దిగ్విజయము చేయును. అతని మాట అపుడు శాసనము. అతఁడు విశ్రమించెనా వీచోపులు, పలుకరించెనా బహుమానము.

పాపారావుగా రసలే రాజుగారు. మఱి యిపుడు పెండ్లికొడుకు.

వివాహమంటపము లతావృక్షములచే నందనమువలెఁ బూలచేఁ జైత్రరథమువలె నుండెను. పాపారావుగారు పటాకత్తి వ్రేలాడుచుండఁగా వివాహ మంటపమునఁ బ్రవేశించిరి.

లగ్న మాసన్న మాయెను. వివాహ మంటపమున పట మంటపము బూరటిల్లి వధూ ప్రవేశ మెఱిఁగించెను.

వియ్యంకులును వారి బంటులును ఎదురు బొదుగుగా నిలుచుండిరి.

4

పురోహితుని తొందరవలన పాపారావుగారు పట గృహమునకు అఱ్ఱుసాఁచిరి. అందు వెంకయ్యమ్మారావుగారు కూర్చుండిరి. ఆమె కీవల చంద్రిక నిలిచియుండెను.

పాపారావుగారు వధువును జూచి తలపై కెత్తి చంద్రికనుజూచువారు చంద్రికనుజూచుచునే యుండిరి.

చంద్రిక తల వంచుకొనెను. వెంకయ్యమ్మారావుగారు తల యెత్తిరి.

మంత్ర మాయెను, తంత్రము కానిండని పురోహితుఁడు మొదలకించెను.

తాళిబొట్టు కట్టించుటకుఁ జంద్రిక క్రిందికి వంగెను. సూదంటురాయి లోహము నాకర్షించెను.

'పెండ్లి పీటమీఁదఁ గూరుచుండఁదగిన దిది; పెండ్లికూఁతు ప్రక్కనిలువఁబడఁదగిన దది' అని తలఁచుచున్న పాపారావుగారి మానసమునఁ బురాణవైరము పురాణించెను.

పురోహితుఁడు తొందరించెను. మంగళసూత్రము బంధింపఁజేయుటకుఁ జంద్రిక పాపారావుగారి చేతులను మృదువుగా స్పృశించెను. ఆ స్పర్శ వారికి ముక్తాహారములు కల్పించెను. వివాహ సభలో నవ్వులును గుసగుసలును బయలుదేఱెను. పురోహితుఁ డింకొకతూరి హెచ్చరించెను. వెంకయ్యమ్మారావుగారి మనసు విఱిగెను.

అంతలో పాపారావుగారిచేతిలోని మంగళసూత్రము చంద్రికకు గ్రైవేయ మాయెను. చంద్రిక చూపు లతనికిఁ దలఁబ్రాలాయెను.

వెంకయ్యమ్మారావుగారు రుద్రయ్యమ్మారావుగారై రుసరుసలాడుచు రాణివాసములోనికిఁ బరుగిడిపోయిరి. వివాహసభ దక్షయజ్ఞ మాయెను.

5

ఇదేమి దుస్సాహస మని తల్లి గద్దించెను,

'అతఁడు దానికే తగినవాఁడు. నాకనుల యెదుట నతఁడు చంద్రిక మెడలో పుస్తెకట్టెను. ఇది చలపాడుచుట కాక మఱేమి? కొబ్బరికాయ తలయు కుండబొజ్జయుఁ గల యీ మన్మథుఁడు మఱి నాకు దొరకఁడా ?...

'అదియేమే, అదియేమే' యని తల్లి నోరు మూసికొనెను.

'కలువవారి రక్తము నా శరీరమున నినుకలేదు. చలువ

వారికి రణరంగమున మెఱవడిచేయుటయే పరాక్రమమునకుఁ బాడి. ఈతులువ నాయెదుటనే నాదానికిఁ దాళి కట్టుచుండఁగాఁ జూచిచూచి నీ యానతి చొప్పున నోరుమూసికొని దైవముఖమును దేవిరింపఁబోవను.' అని వెంకయ్యమ్మారావుగా రనుచుండఁగా తండ్రి యటకు విజయంచేసెను. వెంకయ్యమ్మారావుగారు తలిదండ్రులకుఁ బ్రదక్షిణముచేసి 'వైరమునకు నన్నులంచ మిచ్చితిరి. అతఁడు బలియిుచ్చెను. ఈ మీ పొరపాటును కత్తిగాని మఱి యొకటి సవరింపఁజాలదు. ధర్మమును కాపాడఁదలఁచుకొందురేని వెంటనే కత్తిగైకొనుఁడు. ఇఁక నిసుమంతయు నవకాశము లేదు.' అని కత్తుల బావి కడ కుఱికెను.

## 6

'వెనుకటి కసి తీర్చుకొనుటకే పెండ్లి పెట్టుకొని ర'ని బందుగులనుకొనిరి. 'పెండ్లికూఁతురు పీటవిడిచి యుమ్మవమానించె' నని చలువవారనిరి. దానికిఁ బుస్తెకట్టినవారిపైఁ గత్తికట్టితి' మని కలువవారనిరి.

వివాహ రంగము చూచుచుండఁగాఁ జూచుచుండఁగా రణ రంగముగా మాఱెను.

కర్మ మేతము. దాని కొమ్మొకతూరి మన్ను ముట్టును. మఱియొకతూరి మిన్ను ముట్టును.

'వధువును బట్టుకొనుఁడు వధువును బట్టుకొనుఁ డ'ను కేకలు వినఁబడెను. 'వరుని బట్టుకొనుఁడు వరుని బట్టుకొనుఁడ'ను కేకలు చెవి చఱచెను.

పాపారావుగారు చంద్రికను గట్టిగాఁ బట్టుకొనిరి. చంద్రిక పాపారావుగారిని గట్టిగాఁ బట్టుకొనెను.

'పట్టుకొనుఁడు పట్టుకొనుఁడు.'

ఈ కేకలే యుద్ధమునకు దుడ్డుచ్చి. ఇరువాఁగులవారును చేతులు కలుపుకొనిరి. బంటులును బంటులును దాసికలును దాసికలును బందుగులును బందుగులును వియ్యపురాలును వియ్యపురాలును వియ్యంకుఁడును వియ్యంకుఁడును ధర్మయుద్ధ మొనరించి వీర స్వర్గ మలంకరించిరి.

పాపారావుగారు రాణివాసము చొఱఁబాఱుచుండఁగా వెంకయ్యమ్మారావుగారి అసిపుత్త్రిక అతనిమీఁదఁ బడఁబోయెను. అంతలో చంద్రిక అడ్డము వచ్చెను. ఆ కత్తి నామె క్రిందఁ బాఱవయిచెను. అది నేలఁబడి రెండుగా తునిసెను.